సాక్షి తిరుపతి

బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



‘సదరం’గా సర్దేస్తున్నారు!

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల పేరుతో కొందరు సర్దేస్తున్నారు. పేదలనే టార్గెట్ చేసి అడ్డంగా దోచేస్తున్నారు. - 8లో



ఎమ్మార్‌పల్లెలో దొంగల హల్‌చల్

తిరుపతి రూరల్ : నగరంలోని ఎమ్మార్‌పల్లె పరిసర కాలనీల్లో సోమవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	25
చిత్తూరు	36	24
తిరుమల	32	21
గూడూరు	36	26
నగరి	37	26

న్యూస్‌రీల్

బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



శేషవస్త్రం, ప్రసాదం, ఆహ్వాన పత్రాన్ని సీఎం వైఎస్ జగన్‌కు అందిస్తున్న నేదురుమల్లి

వెంకటగిరి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు మేలో ప్రారంభం కానున్న తరుణంలో ఆహ్వాన పత్రిక, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

‘వందే భారత్’కు జై

- త్వరలో అదనంగా 16 బోగీలు



వందేభారత్ రైలు



సత్యనారాయణ, తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్

తిరుపతి అర్బన్ : సికింద్రాబాద్-తిరుపతికి రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయాణికులక నుంచి విశేష స్పందన లభిస్తోందని తిరుపతి రైల్వేస్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సాధారణ రైళ్ల కంటే టికెట్ ధరలు అధికంగా ఉన్నప్పటికీ మెరుగైన సౌకర్యాలు ఉండడంతో ప్రయాణికులు పెద్దసంఖ్యలో మొగ్గుచూపుతున్నారన్నారు. ప్రస్తుతం 8 బోగీల్లో 520 సీట్ల సామర్థ్యంతో నడుస్తున్న ఈ రైలుకు రెండు రోజుల ముందే టికెట్లు బుక్ అయిపోతున్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో మరో 16 బోగీలను అదనంగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని, దీంతో మొత్తం 1,040 టికెట్లు అందుబాటులోకి రానున్నాయని వివరించారు.

పుష్పయాగం.. అంకురార్పణం



అంకురార్పణలో కొలువైన సేనాధిపతి

తిరుపతి కల్చరల్ : నగరంలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో బుధవారం పుష్పయాగం నిర్వహించనున్నారు. మంగళవారం ఈ మేరకు ఘనంగా అంకురార్పణ చేశారు. పుష్పయాగం సందర్భంగా ఉదయం 10 గంటలకు స్వామివారికి స్నపన తిరుమంజనం జరిపించనున్నారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల సుగంధ సుమాలతో సీతారాములకు అభిషేకించనున్నారు. రాత్రి 7 గంటలకు సీతాలక్ష్మణ సమేతంగా కోదండరామస్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. మార్చి 20 నుంచి 28 వరకు జరిగిన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో తెలిసీ తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తార్థం పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు వెల్లడించారు. రూ.వెయ్యి చెల్లించి దంపతులు పుష్పయాగంలో పాల్గొనవచ్చని తెలిపారు.

తిరువణ్ణామలైకు 62 బస్సులు



చెంగల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి

తిరుపతి అర్బన్ : పౌర్ణమిని పురస్కరించుకుని మే 4వ తేదీన తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లే భక్తుల కోసం ప్రత్యేకంగా 62 బస్సులను నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మార్చిలో 14 బస్సులకు రూ.4లక్షల రాబడి వచ్చిందని, ఏప్రిల్ 27 బస్సులకు రూ.8లక్షలు సమకూరిందన్నారు. ఇప్పుడు 62 బస్సులపై రూ.12లక్షల రాబడి వస్తుందని అంచనా వేస్తున్నామని, ఏడాదిలో 12 పౌర్ణమిలకు గాను ప్రత్యేక బస్సులతో రూ.కోటి ఆదాయం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు.



మాస్టర్ ప్లాన్

తిరునగరి నవీనీకరణకు ప్రభుత్వం అత్యున్నత ప్రణాళిక రూపొందించింది. ఆధ్యాత్మిక క్షేత్రానికి అదనపు సొబగులద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. నిత్యం రాకపోకలు సాగించే వేలాదిమంది భక్తుల సౌకర్యార్థం పకడ్బందీ చర్యలు చేపట్టింది. తిరుపతి వాసులకు అత్యాధునిక మౌలిక వసతులు కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో నగరపాలక సంస్థ రహదారుల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసింది. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఏకకాలంలో సువిశాలమైన 14 రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని వివిధ మార్గాలను శివారు ప్రాంతాలకు అనుసంధానం చేస్తోంది.

- శరవేగంగా రహదారుల నిర్మాణం
- మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి పరుగులు
- పెరుగుతున్న భూముల ధరలు
- తొలగుతున్న ట్రాఫిక్ కష్టాలు
- పచ్చనేతల విషప్రచారంపై మండిపడుతున్న నగరవాసులు

సాక్షి, తిరుపతి/తిరుపతి తుడా : మాస్టర్‌ప్లాన్ రోడ్లతో తిరుపతి నగరం అత్యంత సుందరంగా తయారవుతోంది. ఇదివరకు ముళ్లపొదలతో దర్శనమిస్తున్న ప్రాంతాలు సైతం నివాసయోగ్యంగా మారుతున్నాయి. ఆయా రోడ్లకు ఇరువైపులా నూతన భవనాల నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు అభివృద్ధికి దూరంగా ఉన్న కాలనీల్లో సైతం ఇంటి స్థలాల ధరలకు రెక్కలు వస్తున్నాయి. కొత్త రోడ్ల కారణంగా ఆయా ప్రాంతాల్లోని స్థానికులు చిరువ్యాపాలు ప్రారంభించుకుని ఉపాధి పొందుతున్నారు.

ఇది కదా అభివృద్ధి

నగరంలో ఉద్యమంలా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణంపై తిరుపతి వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో 50 ఏళ్ల అవసరాలే లక్ష్యంగా చేపట్టిన పనులను ఆసక్తిగా గమనిస్తున్నారు. నగరాన్ని విస్తరించడం, ప్రస్తుతం రద్దీగా ఉన్న ప్రాంతాలపై ఒత్తిడి తగ్గించమే ప్రధాన అజెండా మాస్టర్‌ప్లాన్‌ను ప్రతిపాదించిన డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి ముందుచూపును అభినందిస్తున్నారు. ఏళ్ల తరబడి రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు తొలగిపోతుండడంపై ఆనందపడున్నారు. అభివృద్ధి అంటే ఇది కదా అంటూ ప్రశంసిస్తున్నారు. పచ్చబ్యాచ్ విషప్రచారంపై మండిపడుతున్నారు. రాజకీయ కారణాలతో అభివృద్ధిని అడ్డుకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరిస్తున్నారు.

ఒకేసారి 14 రహదారులు

తిరుపతికి తూర్పుప్రాంతాన మాస్టర్‌ప్లాన్ కింద ఒకేసారి 14 రోడ్ల నిర్మాణం చేపట్టారు. అప్పటికే డాక్టర్ వైఎస్సార్ మార్గ్ (డీబీఆర్ రోడ్డు), అన్నమయ్య మార్గ్ (కరకంబాడికి వెళ్లే గెస్ట్‌లైన్‌డేస్ రోడ్డు) అభివృద్ధితో సత్ఫలితాలు వచ్చాయి. ఆర్టీసీ బస్టాండుకు వంద అడుగుల దూరంలోని చింతలచేనుకి రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో అక్కడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందిపడేవారు. నేడు మాస్టర్ ప్లాన్ రోడ్డు అందుబాటులోకి రావడంతో ఆ ప్రాంతం రూపురేఖలే మారిపోయాయి. అనతికాలంలోనే అభివృద్ధివైపు పరుగులు పెడుతోంది. వందలాది భవనాలు వెలుస్తున్నాయి. రాకపోకలకు రాజమార్గంగా నిలిచింది. ఇది గమనించిన డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి మాస్టర్‌ప్లాన్ రోడ్ల అవశ్యకతను గుర్తించి కార్పొరేషన్ కౌన్సిల్‌లో ప్రతిపాదించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చొరవతో మేయర్ శిరీష అధ్యక్షతన కౌన్సిల్ ఆమోదం తెలిపింది. యుద్ధప్రాతిపదికన చేపట్టిన మాస్టర్‌ప్లాన్ రోడ్లతో నగరానికి తూర్పువైపున సుమారు 3వేల ఎకరాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది.



గొల్లవానిగుంట వద్ద ప్రారంభానికి సిద్ధంగా 80 అడుగుల రోడ్డు

మట్టిరోడ్డే దిక్కనుకున్నాం



సుమారు ఆరేళ్లుగా గొల్లవాని గుంటలో నివసిస్తున్నాం. చిన్నపాటి వర్షం కురిసినా ఈ ప్రాంతం బురదమయంగా మారుతుంది. ముళ్లపొదల మధ్య మట్టి రోడ్డే దిక్కుగా ఉండేది. కొరమేనుగుంట-గొల్లవానిగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్డును కలుపుతూ అభివృద్ధి చేస్తున్న తొండమాన్ చక్రవర్తి రోడ్డు మాకు కొత్త ఊపిరిని ఇచ్చింది. మట్టిరోడ్డే దిక్కనుకున్న మాకు అద్దంలాంటి 40 అడుగుల రోడ్డు నిర్మిస్తున్నారు. – హరిత, స్థానికులు

స్థలాల విలువ పెరిగింది



ఐదేళ్ల క్రితం కొరమేనుగుంటలో అంకణం రూ.60 వేలు ఉండేది. ఇప్పుడు మాస్టర్‌ప్లాన్ రోడ్డు వచ్చాక రూ.2లక్షలు చెబుతున్నారు. ఈ మార్గంలో రహదారి నిర్మిచడంతో స్థలాల విలువ భారీగా పెరగింది. ఇక్కడ రోడ్డు వస్తుందని తెలిసుంటే అప్పట్లోనే కొనుగోలు చేసుకునేవాళ్లం. – రమేష్, తిరుపతివాసి

ఆనందంగా ఉంది



బస్టాండుకు సమీపంలోనే ఉన్నా మా చింతలచేను 40 ఏళ్లుగా అభివృద్ధికి దూరంగానే ఉంది. సరైన రోడ్డు లేక రాకపోకలు కష్టంగా ఉండేది. మా స్థలం అమ్ముకుందామన్నా ధర లేక మిన్నకుండిపోయాం. ప్రస్తుతం రోడ్డు నిర్మించడంతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో చాలా ఆనందంగా ఉంది. – రామాపురం కవిత, స్థానికులు

ఎవరూ పట్టించుకోలేదు



కైకాలచెరువు ప్రాంతంలో సుమారు 15 ఏళ్లుగా నివసిస్తున్నాం. ఇక్కడి రోడ్డును అభివృద్ధి చేద్దామని ఎవరూ పట్టించుకోలేదు. ఇన్నాళ్లకు అంకుర ఆస్పత్రి వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ ప్రాంతవాసులకు ఎంతో మేలు జరుగుతోంది. పదుల సంఖ్యలో భవనాలను నిర్మిస్తున్నారు. – నటరాజ్, స్థానికుడు

రుణపడి ఉంటాం



హీరోహోండా షోరూం పక్కన నుంచి పద్మావతి పురం ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తున్న మాస్టర్‌ప్లాన్ రోడ్డు తో మా జీవితాల్లో వెలుగులు వచ్చాయి. ఇప్పటి వరకు సరైన రోడ్డు లేకపోవడంతో ఇల్లు కూడా కట్టుకోలేదు. రోడ్డు పనులు ప్రారంభం కాగానే ఇంటినిర్మాణానికి శ్రీకారం చుట్టా. ఇంతమేలు చేసిన డిప్యూటీ మేయర్ అభినయ్‌కు రుణపడి ఉంటాం. – సరోజ, స్థానికులు

రోడ్డు ఉంటేనే అభివృద్ధి



ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే మంచి రోడ్డు ఉంటేనే సాధ్యమవుతుంది. కొరమేనుగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్డుతో ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. మరో 6 నెలల్లో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఖాళీస్థలాల్లో రోడ్డు వేయడాన్ని తప్పుపట్టడం టీడీపీ నేతల మూర్ఖత్వానికి నిదర్శనం. – వెంకటేష్, కొరమేనుగుంట

కొత్త రూపు వచ్చింది



దాదాపు పదేళ్లుగా గొల్లవాని గుంటలో నివసిస్తున్నాం. సరైన రోడ్డు లేక ఈ ప్రాంతం దయనీయస్థితిలో ఉండేది. మమ్మల్ని పట్టించుకునేవారే ఉండేవారు కాదు. ఎట్టకేలకు గొల్లవానిగుంట మాస్టర్‌ప్లాన్ రోడ్డు అభివృద్ధితో ఈప్రాంతానికి కొత్తరూపు వచ్చింది. – మేనక, స్థానికులు

చల్లని రేడు..భక్తజనం తోడు!



చంద్రప్రభ వాహనంపై అగస్త్యేశ్వరస్వామి



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

- అగస్త్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆరంభం
- చంద్రప్రభపై స్వామి వారు విహారం
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తజనం

నారాయణవనం: మండలంలోని సముదాయం గ్రామంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లు చంద్రప్రభ వాహనంపై గ్రామ వీధుల్లో విహరిస్తూ కనువిందు చేశారు. ఉదయం అర్చకులు నిత్యపూజాది కార్యక్రమాలను పూర్తిచేశారు. అనంతరం ఉత్సవమూర్తులు తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి ఆలయ అంతర ప్రాకారంలో ఊరేగింపుగా ధజస్తంభం వద్దకు వేంచేశారు. వేద మంత్రాల నడుమ అర్చకులు నందీశ్వరునికి, ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించారు. 10.30 గంటలకు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని ధ్వజస్తంభానికి అధిరోహింపజేయడంతో బ్రహ్మోత్సవాలు ఆరంభమయ్యాయి. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, అర్చకులు రమేష్ గురుకుల్, జమేదార్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. రెండో రోజు బుధవారం సాయంత్రం అగస్త్యేశ్వరస్వామి సింహ వాహనంపై ఊరేగనున్నారు.

28 వరకు ఏపీఆర్‌జేసీ దరఖాస్తుకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలకు సంబంధించి ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి మే 20వ తేదీన నిర్వహించనున్న పరీక్షకు దరఖాస్తు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించారు. మంగళవారం ఈ మేరకు విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూళ్లలో పదోతరగతి చదివిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. ఏపీఆర్‌జేసీలో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులతో పాటు వృత్తి విద్యా కోర్సులైన ఈఈటీ, సీజీటీలో అడ్మిషన్లు పొందవచ్చని సూచించారు. వివరాలకు 93999 76999, 86888 88802 నంబర్లతో సంప్రదించాలని కోరారు.

నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలను బుధవారం సాయంత్రం 5గంటలకు మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేయనున్నారు. మంగళవారం ఈ మేరకు ఆర్ఐఓ రమేష్ వెల్లడించారు.

లోకేష్ వ్యాఖ్యలపై దళితాగ్రహం



అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న నేతలు

తిరుపతి మంగళం(తిరుపతి జిల్లా) : దళితులను కించపరుస్తూ నారా లోకేష్ చేసిన వ్యాఖ్యలపై దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తిరుపతిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. లోకేష్ వేషధారణలోని వ్యక్తిని కోడిగుడ్లు, టమాటాలు, చీపుర్లతో కొడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. అనంతరం లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ దళితులంటే చంద్రబాబు, చినబాబుకు ఎప్పుడూ చిన్నచూపేనన్నారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలనుకుంటారా..? అని గతంలో చంద్రబాబు అవమానిస్తే, దళితులు పీకిందేమీ లేదు అని లోకేష్ మరింత దిగజారి వ్యాఖ్యానించారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో దళితులే టీడీపీ సైకిల్‌కు గాలి పీకేస్తారని స్పష్టం చేశారు. దళితుల అభ్యున్నతి, సంక్షేమమే పరమావధిగా నిత్యం తపిస్తున్న గొప్ప నేతలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రీజనల్ కో–ఆర్డినేటర్ తలారి రాజేంద్ర, పార్టీ నాయకులు అనిల్, మధు, వంశీ, శివ, కార్తీక్, నరసింహారెడ్డి, మంజుల, శ్యామల, వెంకటేష్, పసుపులేటి సురేష్ పాల్గొన్నారు.

‘దివ్య’మైన స్వామి దర్శనం



జెండా ఊపి రైలును ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, ఏజే శేఖర్ తదితరులు



శ్రీవారి దర్శనానికి వెళుతున్న దివ్యాంగులు

రేణిగుంట/తిరుమల: తమిళనాడుకు చెందిన దివ్యాంగ బాల,బాలికలు శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి సహకారంతో బధిరులు, దివ్యాంగ పిల్లలను శ్రీవారి దర్శనానికి తీసుకువచ్చేందుకు గాను ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని చెన్నై ఫుడ్ బ్యాంక్, రాజస్థాన్ యూత్ అసోసియేషన్, (ఆర్‌వైఏ) మద్రాస్ మెట్రో ట్రస్ట్‌లు రైల్వే శాఖ నుంచి అనుమతులు తీసుకున్నాయి. 1,008 మంది దివ్యాంగ పిల్లలు, 300 మంది వలంటీర్లతో కూడిన ప్రత్యేక రైలును చెన్నై సెంట్రల్ రైల్వే స్టేషన్‌లో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. రేణిగుంట రైల్వే స్టేషన్‌కు ఈ రైలు చేరుకున్న అనంతరం అందులో ఉన్నవారంతా 31 ప్రత్యేక బస్సుల్లో తిరుమలకు చేరుకున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట పోలీసులు, రైల్వే జీఆర్‌పీ కలిసి బస్సులన్నీ ఒకేసారి వెళ్లేలా గ్రీన్ చానల్ ఏర్పాటు చేశారు. తిరుమల చేరుకున్న అనంతరం శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో బాలిరెడ్డి కలిసి వృద్ధులు, దివ్యాంగుల క్యూలైన్ ద్వారా దర్శనానికి వెళ్లేందుకు వీరికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనంతో వీరి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తమ మనోనేత్రంతో శ్రీవారిని దర్శించుకున్నామని పలువురు అంధులు సంతోషం వ్యక్తం చేశారు. వీరిలో ఎక్కువమంది తొలిసారిగా స్వామివారిని దర్శించుకున్న వారే ఉన్నారు. దర్శనానంతరం తరిగొండ వెంగమాంబ కాంప్లెక్స్‌లో అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం రాత్రి తిరిగి ఇదే రైలులో చెన్నై బయలుదేరారు. చెన్నై స్థానిక సలహా మండలి చైర్మన్ శేఖర్ రెడ్డి, కమిటీ సభ్యులు పీవీఆర్ కృష్ణమూర్తి, మోహన్‌రావు, కార్తికేయ, రాధాకృష్ణన్, అశోక్, యువరాజు ఉన్నారు.



దర్శనానంతరం శ్రీవారి ఆలయం వెలుపల దివ్యాంగులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్‌ఓ శ్రీనివాసరావు

తిరుపతి తుడా : పరిసరాల పరిశుభ్రతతోనే విషజ్వరాలను నివారించవచ్చని డీఆర్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం తిరుపతిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. అలాగే తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. డీఎంహెచ్ఓ శ్రీహరి మాట్లాడుతూ మలేరియా వ్యాధి కారక క్రిములను పరిశుభ్రతతో నిర్మూలించవచ్చన్నారు. రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడు, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ సుధారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

చిల్లకూరు : మండలంలోని తీగపాళెంలో మంగళవారం విద్యుదాఘాతానికి గురై రాఘవేంద్ర(15) అనే బాలుడు మృతి చెందాడు. వివరాలు.. ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో బాలుడు మోటార్ వేసేందుకు యతి్నంచాడు. అప్పటికే తెగిపోయిన విద్యుత్ తీగ తగలడంతో రాఘవేంద్రకు షాక్ కొట్టి అక్కడికక్కడే మరణించాడు. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

పెట్రోల్ దాడిలో బాధితురాలికి పరామర్శ



బాధితురాలి ఆరోగ్యపరిస్థితి తెలుసుకుంటున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : తొట్టంబేడు మండలం బోనుపల్లె దళితవాడకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళపై ఆమె భర్త పెట్రోల్‌తో దాడి చేసి గాయపరచిన సంగతి తెలిసిందే. మంగళవారం తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న బాధితురాలిని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి పరామర్శించారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితో మాట్లాడి బాధితురాలికి సాయం అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్య నాయుడు, శ్రీరాములురెడ్డి, వీరయ్య, గంగాధరం, ఎల్లయ్య పాల్గొన్నారు.

‘సదరం’గా సర్దేస్తున్నారు!

- చిత్తూరు జిల్లా నింద్ర మండలం ఆరూరు గ్రామానికి చెందిన దర్శిల్ ఈ నెల 17వ తేదీన సదరం సర్టిఫికెట్ కోసం రుయాకు వచ్చాడు. అవకాశం కోసం కాచుకుని ఉన్న సుబ్రమణ్యం వలలో చిక్కుకున్నాడు. మాయమాటలు నమ్మి రూ.50వేలు సమర్పించుకున్నాడు. సర్టిఫికెట్ రాకపోవడంతో జరిగిన మోసాన్ని గ్రహించి మీడియా ముందుకు వచ్చి ఆధారాలు బయటపెట్టాడు.

- జిల్లాలోని పాకాల మండలం రమణయ్యగారి పల్లెకు చెందిన రజాక్(56) తీవ్రమైన అనారోగ్యంతో దాదాపు ఐదేళ్లుగా రుయాలోనే చికిత్స పొందుతున్నాడు. పింఛన్ పొందేందుకు సదరం సర్టిఫికెట్ అవసరమైంది. దీంతో ఆర్థో విభాగంలో వైద్యపరీక్షలకు వెళ్లాడు. అప్పటికే అక్కడ కాపుగాచిన సుబ్రమణ్యం చేతికి చిక్కాడు. సర్టిఫికెట్ ఇప్పిస్తానని నమ్మబలకడంతో రూ.10వేలు చెల్లించుకున్నాడు. 6నెలలు గడిచినా దిక్కూమొక్కూ లేకపోవడంతో నెత్తీనోరూ బాదుకుంటున్నాడు.

ఇవి మచ్చుకు రెండు మాత్రమే. ఇలాంటివి రుయాలో నిత్యం వెలుగు చూస్తూనే ఉన్నాయి. బాధితులు రుయా సూపరింటెండెంట్ నాగమునీంద్రుడికి వరుసగా ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు. ఆయన తనకు సంబంధం లేదని చేతులు దులుపుకుంటూనే ఉన్నారు. అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేస్తే బాధితులే వెళ్లి నిందితుడిని పట్టుకువస్తే చర్యలు తీసుకుంటామని వెళ్లగొట్టేస్తున్నారు. నకిలీ అడెంటిటీ కార్డులు.. ఎమ్మెల్యేల పేరుతో నకిలీ సిఫార్సు లేఖలు.. నకిలీ సదరం దరఖాస్తులు ఇలా.. రుయా కేంద్రంగా యథేచ్ఛగా సాగుతున్న సుబ్రమణ్యం దందాను అడ్డుకునేవారు కనిపించడం లేదు. ఒక్కోసారి సెక్యూరిటీ సిబ్బందికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినా చర్యలు కానరావడం లేదు.

- దివ్యాంగులే టార్గెట్‌గా రుయాలో దందా
- సర్టిఫికెట్ల పేరుతో బురిడీ
- వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాలు

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో సుబ్రమణ్యం అనే వ్యక్తి సదరం సర్టిఫికెట్ల మాఫియా నడిపిస్తున్నాడు. ఎస్వీ మెడికల్ కళాశాలలో వలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న ఓ ఉద్యోగి అండదండలతో నకిలీ దందా సాగిస్తున్నాడు. వీరికి ఆస్పత్రిలోని కొందరు సిబ్బంది సహకారం అందిస్తున్నారు. ఈ క్రమంలోనే సుబ్రమణ్యం చేతిలో మోసపోయిన బాధితులు ఆధారాలతో సహా ఫిర్యాదు చేస్తున్నా ఆస్పత్రి అధికారులు కనీసం స్పందించడంలేదు. సదరం సర్టిఫికెట్ కోసం వచ్చిన పేద దివ్యాంగుల నుంచి వేలాది రూపాయలు దండుకుంటున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కాపు కాచి బురిడీ!


పలు ప్రాంతాల నుంచి సదరం, మెడికల్ సర్టిఫికెట్ల కోసం రుయా ఆస్పత్రికి వచ్చే పేదలను సుబ్రమణ్యం తదితరులు టార్గెట్ చేస్తున్నారు. ఆయా విభాగాల వద్ద కాపుకాచి సర్టిఫికెట్లకోసం వచ్చే వారిని గుర్తించి తమవల్లనే పని అవుతుందని నమ్మిస్తున్నారు. తమ వద్ద ఉన్న నకిలీ పత్రాలను చూపించి బురిడీ కొట్టిస్తున్నారు. ఫోన్ నంబర్లు ఇచ్చి రోజూ మాట్లాడుతూ బేరం కుదుర్చుకుంటున్నారు. 60 శాతానికి పైగా వైకల్యం కానీ, వ్యాధి ఉన్నట్లు సర్టిఫికెట్ ఇప్పిస్తామని రూ.వేలు గుంజేస్తున్నారు. నెలల తరబడి తిప్పించుకుని మొహం చాటేస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ ముఠా రుయాలోనే తిష్ట వేసి మోసాలకు పాల్పడుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా సుబ్రమణ్యం నకిలీ సర్టిఫికెట్లతో పలుమార్లు పట్టుబడినా అధికారులు చూసీచూడనట్టు వదిలేయడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



సుబ్రమణ్యం

పర్యవేక్షణ లోపం

రుయాలో అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. సదరం సర్టిఫికెట్ల పేరుతో దోపిడీ, ఆరోగ్యశ్రీ ఆసరా కుంభకోణం, సంతకాల ఫోర్జరీ వంటి అనేక వరుస ఘటనలతో రుయా ప్రతిష్ట మసకబారుతోంది. త్వరలోనే ఉద్యోగ విరమణ చేయనున్న ఓ అధికారి నిర్లక్ష్యమే ఇందుకు కారణమని పలువురు సిబ్బంది బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ నిత్యం పర్యవేక్షిస్తుండేవారు. సదరం సర్టిఫికెట్ల జారీని తనిఖీ చేసేవారు. ఆస్పత్రి పరిశుభ్రత, రోగులకు వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించేవారు. ఏడాది నుంచి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించకపోవడం అక్రమార్కులకు వరంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



సుబ్రమణ్యం ఖాతాకు బాధితుడు ఫోన్‌పే చేసిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం

సదరం సర్టిఫికెట్ల పేరుతో సుబ్రమణ్యం అనే వ్యక్తి డబ్బులు వసూలు చేశాడనే ఫిర్యాదులు ఉన్నాయి. ఆ వ్యక్తికి రుయాకి ఎలాంటి సంబంధం లేదు. బాధితులు అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇకపై ఇలాంటివి జరగకుండా చర్యలు చేపడతాం.

–డాక్టర్ నాగమునీంద్రుడు,
సూపరింటెండెంట్, రుయా ఆస్పత్రి

కుక్కల దాడిలో దుప్పి మృతి



పాకాల : మండలంలోని దామలచెరువు పంచాయతీ కాకర్లవారిపల్లెలో మంగళవారం కుక్కల దాడి చేయడంతో ఓ దుప్పి మృతి చెందింది. స్థానికుల కథనం మేరకు.. అటవీప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన దుప్పిని కుక్కలు తరిమి తరిమి గాయపరిచడంతో దుప్పి మృత్యువాత పడింది.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,080
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,545

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.76,900
రిటైల్ వెండి గ్రాము	రూ.78.90

సీఆర్ రెడ్డికి కన్నీటి వీడ్కోలు



సీఆర్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

గూడూరు: పట్టణంలోని ప్రముఖ వైద్యుడు సీఆర్ రెడ్డి అంత్యక్రియలు మంగళవారం భారీ జనసందోహం నడుమ నిర్వహించారు. పెద్దసంఖ్యలో ప్రజలు అంతిమయాత్రలో పాల్గొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితోపాటు చెన్నై నుంచి పలువురు వైద్యులు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హరిశ్చంద్రారెడ్డి తదితరులు సీఆర్‌రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీఆర్‌రెడ్డి స్థాపించిన డీఆర్‌డబ్ల్యూ కళాశాల ఎదుట విద్యార్థినులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. పలికారు. అలాగే పట్టణంలోని విశ్రాంత ప్రభుత్వోద్యోగుల భవనంలో సీఆర్‌రెడ్డి సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్‌ఎం బాషా, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రసన్న బి వరాలే, ఆంధ్రప్రదేశ్ కాపు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి ఉన్నారు. వారికి ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్‌సివిల్ జడ్జి బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.



కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషగిరికి జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు

టీడీపీ సర్పంచ్‌కి రూ.1.1 లక్షల లబ్ధి

కేవీబీపురం: మండలంలోని తిమ్మసముద్రం పంచాయతీ సర్పంచ్ కుటుంబానికి సీఎం జగనన్న ప్రభుత్వ హయాంలో రూ.1.1 లక్షలు లబ్ధిచేకూరినట్టు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. మంగళవారం గడపగడపకు కార్యక్రమంలో భాగంగా ఆయన గ్రామంలో పర్యటించారు. జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ పంటల బీమా, వైఎస్సార్ ఆసరా, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా పథకాల ద్వారా సర్పంచ్ కుటుంబానికి మొత్తం రూ.1.1 లక్షలు లబ్ధి పొందినట్టు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే సంక్షేమ బుక్‌లెట్ అందించారు.



సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నేడు తొలివిడత ‘వసతి దీవెన’

తిరుపతి అర్బన్ : ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి జగనన్న వసతి దీవెన పథకం కింద తొలివిడతగా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో బుధవారం నగదు జమ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లా నార్పల నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బటన్‌నొక్కి నగదు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. కలెక్టరేట్‌లో నిర్వహించనున్న జిల్లాస్థాయి కార్యక్రమంలో మొత్తం 39,690 మంది తల్లులకు గాను రూ.38.29 కోట్ల నగదు చెక్కు అందించనున్నట్లు వివరించారు.

మే 13న జాతీయ లోక్ అదాలత్

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో మే 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ వై.వీర్రాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రాజీకాదగిన కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు, పోలీసులు, అధికారులు సహకరించాలని కోరారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి వీర్రాజు

28న తిరుపతికి గవర్నర్ రాక

తిరుపతి అర్బన్: గవర్నర్ అబ్దుల్ నజీర్ ఈ నెల 28వ తేదీన తిరుపతి, తిరుమల పర్యటనకు విచ్చేసున్నట్టు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30కు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి గవర్నర్ చేరుకుంటారన్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 9.40కి తిరుపతిలోని శ్రీపద్మావతి అతిథిగృహానికి వస్తారని తెలిపారు. 11 గంటలకు మహతి ఆడిటోరియంలో నిర్వహించనున్న శ్రీవేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ 7వ స్నాతకోత్సవంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో కడప జిల్లా పర్యటనకు వెళతారని చెప్పారు. తిరిగి సాయంత్రం 6.15కి రేణిగుంట విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గంలో రాత్రి 7.45 గంటలకు తిరుమల వెళ్లి రాత్రి బస చేయనున్నట్టు తెలిపారు. 29న ఉదయం 7.05 గంటలకు తిరుమల శ్రీవారిని దర్శించుకుని, అనంతరం రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారని, ఉదయం 11.00 గంటలకు విజయవాడకు హెలికాప్టర్ లో తిరుగు ప్రయాణమవుతారని వివరించారు.

నిర్వాసితులకు చెక్కుల పంపిణీ



నిర్వాసితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం కన్నలి ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి కోసం గృహాలు కోల్పోయిన 17మంది బాధితులకు మంగళవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.95,90,913ను చెక్కు రూపంలో అందజేశారు. ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం పేదల సంక్షేమానికీ ప్రాధాన్యత ఇస్తోందని, ఇళ్లు కోల్పోయిన పేదలకు ప్రభుత్వంతో చర్చించి చెక్కులు పంపిణీ చేశామన్నారు. నిర్వాసితులు మాట్లాడుతూ తాము గృహాలు కోల్పోతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆయన స్పందించి పరిహారం ఇప్పించడంతో ఎంతో ఆనందంగా ఉందని కృతజ్ఞతలు వ్యక్తం చేశారు కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, నాగభూషణ్, చింత రాజేంద్ర, తొట్టంబేడు మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చీరల వ్యాపారి రూ.75.5 లక్షలకు ఐపీ

తిరుపతి లీగల్ : తిరుచానూరు యోగిమల్లవరానికి చెందిన ఎం.బాలకృష్ణ తిరుపతి అదనపు సీనియర్ సివిల్‌జడ్జి కోర్టులో రూ.75.5 లక్షలకు ఐపీ దాఖలు చేసినట్లు ఆయన తరపు న్యాయవాదులు కె.సుబ్రమణ్యం, ఎం.రాధయ్య మంగళవారం తెలిపారు. పిటిషనర్ బాలకృష్ణ 2014 నుంచి తిరుపతి చుట్టుపక్కల ప్రాంతాల్లో చీరల వ్యాపారం నిర్వహించేవాడు. వ్యాపారం ప్రారంభించడానికి అతను కొంతమంది వద్ద వడ్డీలకు సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారంలో తీవ్ర నష్టం రావడంతో అతను మరికొంత మంది వద్ద అధిక వడ్డీలకు సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. అతని వద్ద చీరలను అప్పుగా తీసుకున్న వారు అతనికి తిరిగి సొమ్ము చెల్లించకపోవడంతో పాటు అతనికి అప్పుగా సొమ్ము ఇచ్చిన రుణదాతల వేధింపులు ఎక్కువయ్యాయి. రుణదాతలకు సొమ్ము చెల్లించలేని స్థితిలో ఈ ఐపీని దాఖలు చేసినట్లు ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. 8 మంది రుణదాతలను ఆయన పిటిషన్‌లో ప్రతివాదులుగా చేర్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భాకరాపేట : తలకోన సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా కలకడకు చెందిన ఇమ్రాన్‌బాషా(35), తన మిత్రుడు జాఫర్‌తో కలిసి బైక్‌పై తలకోనకు వెళ్లాడు. తిరుగుప్రయాణంలో బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఇమ్రాన్‌బాషా అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన జాఫర్‌ను 108లో తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఇమ్రాన్‌బాషా మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎర్రావారిపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటనాస్థలంలో ఇమ్రాన్‌బాషా మృతదేహం

అమ్మవారి సేవలో జాతీయ కమిషన్ సభ్యులు

భాకరాపేట : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ సభ్యులు ఆనంద్ మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారి ఆలయం వద్ద డిప్యూటీ ఏఈవో ప్రభాకర్‌రెడ్డి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కమిటీ సభ్యులు ఆనంద్ ముందుగా ధ్వజస్తంభానికి నమస్కరించి తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



అమ్మవారి ఆలయం వద్ద కమిషన్ సభ్యులు ఆనంద్

ఏపీపీగా కోటేశ్వర్‌రెడ్డి



తిరుపతి లీగల్ : తిరుపతి 10వ అదనపు జిల్లా జడ్జి కోర్టు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా న్యాయవాది కె.కోటేశ్వర్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన 3 ఏళ్లపాటు ఏపీపీగా విధులు నిర్వహించాలని పేర్కొంది. కోటేశ్వర్‌రెడ్డి ఇదివరకు 10వ అదనపు జిల్లాజడ్జి కోర్టు ఏపీపీగా 3 ఏళ్లపాటు పనిచేశారు. సుమారు 20 ఏళ్లగా తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయన మాట్లాడుతూ ఏపీపీగా నియమితులయ్యేందుకు సహకరించిన మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి, ఆర్కే రోజా, ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఎమ్మార్‌పల్లెలో దొంగల హల్‌చల్

- మూడిళ్ల తాళాలు పగలగొట్టిన దుండగులు
- టైలర్ నివాసంలో 18గ్రాముల బంగారు నగల చోరీ

తిరుపతి రూరల్ : నగరంలోని ఎమ్మార్‌పల్లె, సమీప ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. శ్రీనగర్‌కాలనీ, వైకుంఠపురం, ధనలక్ష్మినగర్‌లోని మూడు ఇళ్ల తాళాలు పగలకొట్టేశారు. శ్రీనగర్‌కాలనీలో టైలర్ బాషా ఇంట్లో మాత్రం బీరువాలోని 18 గ్రాముల బంగారు అభరణాలను దోచుకెళ్లారు. బాధితులు ఇంటి ముందు నిద్రిస్తుండగానే దొంగలు తమ పనికానిచ్చేసినట్లు సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ సురేంద్రరెడ్డి, సిబ్బంది ఘటనాస్థలాలకు చేరుకున్నారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జగనన్న పాలనలోనే యువతకు భవిష్యత్తు

తిరుపతి ఎడ్యుకేషన్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే విద్యార్థులు, యువతకు ఉన్నత భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ విద్యార్థి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.ఓబుళరెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ లెక్కల రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మా భవిష్యత్తు నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఎస్వీయూలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి వివరించారు. రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి అంకితభావంతో, నిజాయితీతో సీఎం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి సీఎంగా గెలిపించుకోవాల్సిన బాధ్యత విద్యార్థులు, యువతపై ఉందని తెలిపారు. మణి, ప్రశాంత్, ప్రదీప్, నర్సింహులు, దినేష్, బాషా, రామలింగారెడ్డి, శ్రీనివాసులు, ప్రకాష్, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

ఘనంగా భాష్యకారుల సాత్తుమొర

తిరుమల: శ్రీవారి ఆలయంలో మంగళవారం భాష్యకార్ల సాత్తుమొర ఘనంగా నిర్వహించారు. శ్రీరామానుజులవారు జన్మించిన వైశాఖ మాస ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. ఇందులో భాగంగా ఉదయం భాష్యకార్ల వారిని మాడవీధుల్లో ఊరేగించారు. నడకదారిలోని భాష్యకార్ల సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారిని ఒక తిరుచ్చిపై, భాష్యకార్లవారిని మరో తిరుచ్చిపై ఉంచి మాడ వీధుల్లో ఊరేగించారు. ఆలయంలో విమాన ప్రాకారం చుట్టూ ప్రదక్షిణగా విచ్చేసి భాష్యకార్లవారి సన్నిధిలో సాత్తుమొర నిర్వహించారు.



ప్రత్యేక ఆభరణాలతో సర్లింపు చేశారు.

శ్రీవారి సర్వ దర్శనానికి 12 గంటలు

కాగా, సోమవారం అర్ధరాత్రి వరకు 63,879 మంది శ్రీవారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.88 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో, ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది.